సాక్షి నంద్యాల

గురువారం । 20 । ఏప్రిల్ । 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై దేవస్థానం అధికారులు బుధవారం సాక్షిగణపతికి, ఆలయప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వరాహస్వామి జయంతోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిలంలో వరాహనరసింహస్వామి జయంతి మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి వరాహ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



'పది' మూల్యాంకనం ప్రారంభం

పదో తరగతి పరీక్షల ముల్యాంకనం బుధవారం కర్నూలులో ప్రారంభమైంది. ఈ నెల 26వ తేదీ నాటికి ముల్యాంకనాన్ని ముగించి, మే నెలలో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది.

8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:39	ఉ॥ 4:35
ఆదోని	సా॥ 6:42	ఉ॥ 4:38
నంద్యాల	సా॥ 6:39	ఉ॥ 4:38
ఆత్మకూరు	సా॥ 6:37	ఉ॥ 4:32
బనగానపల్లె	సా॥ 6:42	ఉ॥ 4:32

హదీస్ వెలుగు :

అల్లాహ్ మీరు చేసే పనులు గమనించడం లేదని అనుకోవద్దు. అమావాస్య చీకటిలో నల్లటి రాతికొండ కింద ఉన్న నల్ల చీమనూ చూస్తుంటారు. – పవిత్ర ఖురాన్

పల్లెవించిన బాటలు

- గ్రామీణ రహదారులకు మహర్దశ
- శరవేగంగా సాగుతున్న పనులు
- తొలగిపోతున్న దశాబ్దాల 'దారి'ద్ర్యం
- ప్రధాన రోడ్లు బీటీ, అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా మార్పు
- హైవే, ప్రధాన రహదారులతో 218 గ్రామాల అనుసంధానం
- మెరుగుపడిన పల్లె ప్రజల రవాణా సౌకర్యాలు

జిల్లాలో రహదారుల నిర్మాణం ఇలా	కాల వ్యవధి	రహదారులు	నిర్మాణ పొడవు (కి.మీ)	వెచ్చిస్తున్న నిధులు (రూ. కోట్లు)
	40 నెలలు	196	409.71	316.10

ఆళ్లగడ్డ: మారుమూల గ్రామీణ ప్రాంతాల రహదారులకు మంచి రోజులు వచ్చాయి. గతంలో నరకానికి నకళ్లుగా ఉన్న పల్లె రోడ్లు ఇప్పుడు కొత్త రూపు దాల్చుతున్నాయి. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులు బీటీ, సీసీ రోడ్లుగా మారిపోతున్నాయి. దీంతో ప్రధాన, జాతీయ రహదారులకు పల్లె రోడ్లు అనుసంధానమవుతుండటంతో ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు నూతన రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు, వంతెనల నిర్మాణాలపై దృష్టి సారించారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారుల రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. దశాబ్దాలుగా గ్రామానికి రహదారి లేక పొలం గట్లు, కాల్వల గట్లు వెంట ఇబ్బందులు పడుతూ ప్రయాణించిన ప్రజలు ఇప్పుడు కొత్త దారుల్లో రయ్యమంటూ దూసుకెళ్తున్నారు. నంద్యాల జిల్లాలో 196 రహదారులు 409.71 కిలో మీటర్లు తారు రోడ్లుగా, సీసీ రోడ్లుగా నిర్మిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ, స్టేట్ హైవే, పంచాయతీరాజ్‌ల ఆధ్వర్యంలో రహదారుల అభివృద్ధికి రూ. 316.10 కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. ఆయా రోడ్ల నిర్మాణంతో 218 గ్రామాలు ప్రధాన రహదారులకు అనుసంధానమవుతున్నాయి. గత ప్రభుత్వాల పాలనలో రహదారుల అభివృద్ధి పేరుతో పాలకులు కాంట్రాక్టర్ల ముసుగులో గతుకులకు అతుకులు వేసి జేబులు నింపుకున్నారు. కంకర తేలి, గుంతల మయంగా ఉన్న రోడ్లను కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో రహదారుల అభివృద్ధి చేసి ప్రజల కష్టాలను తీర్చారు.



పైచిత్రంలో కనిపిస్తున్నది డి. వనిపెంట చెంచుగూడెం బ్రిడ్జి. ఈ గ్రామం నుంచి బయటకు రావాలంటే బవనాసి వాగు దాటుకొని రావాలి. దీంతో ఏడాదిలో ఆరు నెలలు గ్రామం నుంచి బయటకు రావడానికి వీలు కలిగేది కాదు. అత్యవసర పరిస్థితుల్లో వాగులో దిగి రావాలి. వర్షాకాలంలో అలా వస్తూ ఇద్దరు ముగ్గురు గల్లంతైన సంఘటనలూ ఉన్నాయి. ఎన్నికల సమయంలో బ్రిడ్జి కట్టిస్తామని పాలకులు హామీ ఇవ్వడం తరువాత ఆ ఊసే ఎత్తక పోవడం పరిపాటిగా మారింది. అధికారులు, నాయకులను గ్రామస్తులు అడిగి అడిగి అలసిపోయారు. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. ఈ ఏడాది రూ 4.80 కోట్లతో బ్రిడ్జి నిర్మించారు. ' మా ఊరికి బ్రిడ్జి నిర్మిస్తారని అనుకోలేదు. జగనన్న మా ఊరికి ఎంతో సాయం చేశారు' ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించారు' అంటూ గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఆనందం వ్యక్తం చేస్తోంది.



చదువులు మెరుగు పడే అవకాశం

పల్లెల్లో విద్యార్థులు ఉన్నత చదువులకు పట్టణాలకు వెళ్లాల్సి ఉంటోంది. చాలా చోట్ల రహదారులు శిథిలావస్థకు చేరడంతో రవాణా సౌకర్యాలు లేక విద్యార్థులు మధ్యలో బడి మానేశారు. ముఖ్యంగా బాలికలు చదువుకు దూరమయ్యారు. కనీసం ఆటోలు, బైక్‌లు వెళ్లలేని దుస్థితిలో రహదారులు ఉండేవి. 40 నెలల్లో జిల్లాలో మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. శిథిలావస్థకు చేరిన రోడ్లు బీటీ, సీసీ రోడ్లుగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తమ పిల్లలను చదువుల కోసం పట్టణాలకు పంపించే అవకాశం ఏర్పడింది.

త్వరితగతిన పనులు

రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత తగ్గకుండా యుద్ధప్రాతిపదికన సెంట్రల్ క్వాలిటీ మానిటరింగ్ టీం సభ్యుల పర్యవేక్షణలో పనులు పూర్తి చేస్తున్నాం. దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులకు ప్రాధాన్యమివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ప్రణాళికలను రూపొందించుకుని పనులు చేపడుతున్నాం.

– సుబ్బరాయుడు, ఆర్‌అండ్‌బీ డీఈ

దశాబ్దాల కల నెరవేరింది



దొర్నిపాడు మండలం వెంకటేశ్వరనగర్ గ్రామం దాదాపు 70 ఏళ్ల క్రితం ఏర్పడింది. నిన్నటి వరకు పొలాల రస్తా తప్పా కంకర రోడ్డు కూడా లేదు. ఏటా ఎండా కాలంలో గ్రామస్తులు చందాలు వేసుకుని మట్టి రోడ్డు వేసుకోవడం, వానా కాలంలో కొట్టుకుపోయి గుంతల మయంగా మారడం, గుంతల దారిలోనే ప్రయాణించడం గ్రామస్తులకు అలవాటుగా మారింది. ఆపదలో 108 వాహనం కూడా గ్రామానికి వచ్చే పరిస్థితి ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో మండల కేంద్రమైన దొర్నిపాడు నుంచి రూ. 227 లక్షలతో 4 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మించారు. ' గతంలో రోడ్డు సౌకర్యం లేక ఎంతో మంది తమ పిల్లలను హాస్టళ్లలో ఉంచి చదివించుకున్నారు. కొన్ని కుటుంబాలు ఊరు విడిచి వెళ్లాయి. ఇన్నాళ్లకు మా ఊరుకు రోడ్డు వేయడంతో ఎర్రగుంట్ల జాతీయ రహదారి మీదుగా నంద్యాల వరకు రాకపోకలు సాఫీగా కొనసాగిస్తున్నాం' అంటూ గ్రామానికి చెందిన సత్యనారాయణ చెబుతున్నారు.



75 ఏళ్ల తర్వాత..



ఆళ్లగడ్డ మండలం బృందావనం గ్రామం ఏర్పడి సుమారు 80 సంవత్సరాలైంది. అయితే గ్రామం నుంచి బత్తలూరుకు రావాలంటే రోడ్డు లేదు. పొలం గట్లు వెంబడి ఊరికి వెళ్లాల్సిందే. ఎన్నికల సమయంలో గ్రామానికి రోడ్డు వేయిస్తామంటూ ఓట్లు అడిగి ఆ తర్వాత పట్టించుకునే వారు కాదు. ఈ గ్రామానికి రోడ్డు రాదని అనేక కుటుంబాలు గ్రామం వదిలి పట్టణాలకు వెళ్లిపోయాయి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో గ్రామం రూపు రేఖలే మారిపోయాయి. బత్తలూరు నుంచి రూ 1.16 కోట్ల నిధులతో తారు రోడ్డు వేయించారు. 75 ఏళ్ల తరువాత రోడ్డు మార్గం సుగమం కావడంతో చాలా ఆనందంగా ఉందని గ్రామానికి చెందిన నాగేషు రాజు చెప్పారు.



సీఎం రుణం తీర్చుకోలేనిది..



ఇది కోవెలకుంట్ల, జమ్మలమడుగు ప్రధాన రహదారి నుంచి గోవిందపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు. గతంలో ఈ రోడ్డు కంకరతేలి నడవడానికి కూడా వీలు లేకుండా ఉండేది. ద్విచక్ర వాహనదారులు చీకటి పడితే ఏ గుంతలో పడాల్సి వస్తుందో అని భయంభయంగా ప్రయాణం సాగించే వారు. రోడ్డు దుస్థితి చూసి ఈ ఊరికి పిల్లనిచ్చేందుకూ ఎవరూ ఆసక్తి చూపే వారు కాదు. రహదారి సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి రూ. 2 కోట్లతో తారురోడ్డు వేయించింది. మూడు తరాలుగా రోడ్డు లేక అవస్థలు పడిన గ్రామ ప్రజలు ఇప్పుడు కొత్త దారిలో ప్రయాణిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని కోన శివరామిరెడ్డి తదితరులు చెబుతున్నారు.



న్యూస్‌రీల్

నెరవేరిన టీచర్ కల

- విధుల్లో చేరిన 98 డీఎస్సీ అభ్యర్థులు



కామినేనిపల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధన చేస్తున్న 98 డీఎస్సీ అభ్యర్థి

శిరివెళ్ల: 1998 డీఎస్సీ అభ్యర్థుల టీచర్ కోరిక నెరవేరింది. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వారికి ఇటీవలే పోస్టులు ఇచ్చారు. మండలంలోని 2 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్ల నియామకం జరిగింది. కామినేనిపల్లె ప్రాథమిక పాఠశాలకు 3 కిలో మీటర్ దూరంలోని గోస్పాడు మండలం జిల్లెలకు చెందిన వెంకటనాగిరెడ్డి ఈ నెల 13వ తేదీన, నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల ప్రాథమిక పాఠశాలకు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వామనరావు ఈ నెల 15న టీచర్‌గా చేరి బోధనలో నిమగ్నమయ్యారు.

మద్దతు ధరతో పసుపు, మొక్కజొన్న కొనుగోలు

నంద్యాల(అర్బన్): 2022-23 రబీలో పండించిన పసుపు, మొక్కజొన్న పంట దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లాలో పసుపుకు సంబంధించి 21 మండలాల్లో 693.60 ఎకరాలు, మొక్కజొన్నకు సంబంధించి 28 మండలాల్లో 47,761.66 ఎకరాలను రైతులు ఈ క్రాప్ చేయించుకున్నారన్నారు. వారంతా ఈ నెల 21వ తేదీలోగా సమీప ఆర్‌బీకేల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వం రూ.1962 మద్దతు ధర ఇస్తుండగా బయట మార్కెట్‌లో రూ.1600 నుంచి రూ1800 మాత్రమే ఉందన్నారు. అదేవిధంగా పసుపు క్వింటా రూ.6850 తో ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ చేయించుకున్న రైతులు ఆయా పంటలను మద్దతు ధరతో అమ్ముకోవచ్చని తెలిపారు.

ఆగమపాఠశాల వార్షిక పరీక్షలు ప్రారంభం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలోని వీరశైవ ఆగమపాఠశాలలో వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో నిర్వహించిన ఈపరీక్షలకు తొలి రోజు 101 మంది విద్యార్థులు హాజరయ్యారు. అర్చక ప్రవేశ ప్రథమ సంవత్సర పరీక్షలకు 50 మంది, అర్చక వర ద్వితీయ సంవత్సరానికి గాను 30 మంది, అర్చక ప్రవర ప్రథమ సంవత్సరానికి 17 మంది, ద్వితీయ సంవత్సరానికి 4 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండురోజుల పాటు జరిగే ఈ పరీక్షలకు సంగారెడ్డికి చెందిన గవర్నమెంట్ డిగ్రీ, అండ్ పీజీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎమ్.మహంతయ్య పర్యవేక్షణాధికారిగా నియమించారు.

సబ్సిడీ విత్తనాలపై ఏపీ సీడ్స్ ప్రత్యేక దృష్టి



ఏపీ సీడ్స్‌లో చురుగ్గా సాగుతున్న విత్తన ప్రాసెసింగ్

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన సబ్సిడీ విత్తనాలను సిద్ధం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే వేరుశనగ దాదాపు 34వేల క్వింటాళ్లు సిద్ధంగా ఉండటం విశేషం. ఇక కందులు, మినుములు, పిల్లపెసర, జీలుగ తదితర విత్తనాలను పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు ఏపీ సీడ్స్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మే నెల మొదటి పక్షంలోగా విత్తనాలను ఆర్‌బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. అందులో భాగంగా విత్తనాల ప్రాసెసింగ్ చురుగ్గా సాగుతోందన్నారు.

జిల్లాల వారీగా కేటాయింపులు

కర్నూలు		నంద్యాల	
విత్తనం	క్వింటాళ్లు	విత్తనం	క్వింటాళ్లు
వేరుశనగ	15905	జీలుగ	4675
కందులు	1080	వేరుశనగ	3560
మినుము	25	కందులు	550
పెసర	5	పెసర	20
కొర్ర	15	మినుము	100
దయంచ	978	కొర్రలు	30
పిల్లిపెసర	191	పిల్లి పెసర	17

భానుడి భగభగలు



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో భానుడి ఉగ్రరూపం కొనసాగుతోంది. మధ్యాహ్నం 12 గంటల నుంచే కర్నూలు, నంద్యాల ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విపత్తుల నిర్వహణ శాఖ ప్రజలకు సూచనలు ఇచ్చింది. మంగళవారం నాటితో పోలిస్తే కర్నూలు జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గినట్లు స్పష్టమవుతోంది.

బుధవారం మధ్యాహ్నం 1 గంట సమయానికి	
ప్రాంతం	డిగ్రీలు
పాములపాడు	44.4
మంత్రాలయం	43.97
2 గంటల సమయానికి	
నందవరం(బనగానపల్లి మండలం)	44.51
ఆత్మకూరు	44.38
పగిడ్యాల	44.28
దొర్నిపాడు	44.17
గోస్పాడు	44.11
కమ్మరచేడు(ఆలూరు మండలం)	43.7
లద్దగిరి(కోడుమూరు మండలం)	43.59
కామవరం(కౌతాళం మండలం)	43.59
3 గంటల సమయానికి	
ఆకుమల్ల(సంజామల మండలం)	44.19
గోస్పాడు	44.19
అవుకు	44.13
గూడూరు	43.85
చిన్నతుంబళం (పెద్దకడుబూరు మండలం)	43.29



ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న ముస్లింలు

ఆత్మీయ ఇఫ్తార్

- మతసామరస్యానికి ప్రతీక రంజాన్
- మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ఆళ్లగడ్డలో ముస్లింలకు ఇఫ్తార్ విందు



మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డికి ఫలహారం తినిపిస్తున్న దృశ్యం, చిత్రంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో బుధవారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఉపవాసదీక్ష చేస్తున్న సుమారు 10వేల మంది ముస్లింలు ఈ విందులో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గత పాలకులు ముస్లింలను ఓటు బ్యాంకుగా చూశారే తప్పా ఏనాడు వారి బాగోగులను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇమాంలకు, మౌజన్లకు గౌరవ వేతనాలు ఇవ్వడంతో పాటు ఉర్దూను రాష్ట్రంలో రెండో అధికారిక భాషగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయక్ వసీం, విజయ డైయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు షేక్‌బాబులాల్, నాయబ్ రసూల్, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నజీర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

- చెత్తతో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పారిశుద్ధ్య పనులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై ఈవోఆర్డీలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మురుగు, చెత్తాచెదారం తొలగింపు అధ్వానంగా ఉందన్నారు. ఈ విషయంలో ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు నిర్లక్ష్యం వీడాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పైప్ లైన్, మోటార్ మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. అలాగే స్పందన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, వినతులను పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. అన్ని మండలాల్లో చెత్త నుంచిసంపద తయారు చేసే కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. గత రెండేళ్ల నుంచి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈఓఆర్డీలు తమ పనితీరు మార్చుకోవాలని, షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఏవైనా సమస్యలుంటే సంబంధిత తహసీల్దార్, సర్పంచ్‌లను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారు చేస్తే గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు, డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

కడప జోన్‌కు కొత్తగా 231 అద్దె బస్సులు

- కోవెలకుంట్ల డిపో తనిఖీలో ఈడీ గోపీనాథరెడ్డి

కోవెలకుంట్ల: కడపజోన్ పరిధిలోని ఆయా డిపోలకు కొత్తగా 231 అద్దె బస్సులు వచ్చాయని ఆ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోను తనిఖీ చేశారు. డిపోలోని రికార్డులు, గ్యారేజ్‌లోని మెకానిక్ సెక్షన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ వీలైనంత త్వరలో పలు డిపోలకు మరో 30 కొత్త అద్దె బస్సులు కేటాయిస్తామన్నారు. కరోనా సమయంలో బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రజారవాణా పూర్తిగా స్తంభించిపోయి ఆర్టీసీ నష్టాలు చవిచూసిందన్నారు. ఖర్చు పెరుగుతుండటంతో నష్టాలు అధిగమించేలా ప్రణాళికలు సిద్ధం చేసి బస్ సర్వీసులు నడుపుతున్నామన్నారు. జోన్ పరిధిలో ఆర్టీసీని లాభాల బాటలో పయనింపచేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్సుల సమయపాలన, మెయింటెనెన్స్(నిర్వహణ)పై దృష్టి సారించామన్నారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఆయా రూట్లకు బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు.



గ్యారేజ్‌ని పరిశీలిస్తున్న కడప ఈడీ గోపీనాథరెడ్డి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ సురేంద్ర, డిపో మేనేజర్ తిరుపతయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

ఆదోనిటౌన్: మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మసోమాయనపల్లికి చెందిన ఆదినారాయణ అనే యువకుడు బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి కింద పడ్డాడు. గాయపడిన వ్యక్తిని ఆదోని రైల్వే పోలీసులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సలు చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆదినారాయణ గుంతకల్‌లోని పెదనాన్న కుమారుడిని చూసేందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆదోని మండలం గణేకల్ వద్ద తెల్లవారుజామున రైలులో నుంచి ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డాడు. బహిర్భూమికి వెళ్లే గణేకల్ ప్రజలు రైలు పట్టాల పక్కన పడి గాయాలతో బాధపడుతున్న ఆదినారాయణను చూసి రైల్వే పోలీసులకు, 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు 108 వాహనంలో క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయాన్ని భార్య భాగ్యకు సమాచారం అందించినట్లు రైల్వే ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

సి.బెళగల్: వైద్యులు సమయపాలన పాటించడంలేదని, విధులను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన సి.బెళగల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని గదులను, ఓపీ విభాగాన్ని, పరిసరాలను, మందులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సమావేశమై సేవలు, విధులపై సమీక్ష నిర్వహించారు. డాక్టర్లు సునీత, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లాహ్ ఇంటి ఆతిథ్యం 'ఎతెకాఫ్'

- నేటి నుంచి ప్రారంభం
- మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- బడీరాత్‌తో సమానంగా పుణ్యం లభించే కార్యం


ఎతెకాఫ్‌లో ఉండి ఖురాన్, జికర్ పఠిస్తున్న దృశ్యం


ఎతెకాఫ్ కోసం మసీద్‌లో డేరాలను ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్)/నంద్యాల(వ్యవసాయం): రంజాన్‌లో బడీరాత్‌కు ఎంత ప్రాధాన్యత ఉంటుందో ఎతెకాఫ్‌కు కూడా అంతే ఉంటుంది. అల్లాహ్ ఇంటి (మసీదు) ఆతిథ్యం ఈ ఎతెకాఫ్ కల్పిస్తుందంటారు. 'రంజాన్ కే మహినేమె..జిస్ గావ్‌మే ఏక్‌భి ఆద్మీ ఎతెకాఫ్ నా రహేత.. ఉస్ గావ్ పర్ లానత్ హై. ఔర్ మేరి రహ్మత్ నహీ రహేగి'. అంటే రంజాన్‌లో ఒక ఊర్లో ఒక్క వ్యక్తి కూడా 'ఎతెకాఫ్' ఉండకపోతే.. ఆ ఊరిపై నా కరుణ, ప్రేమాభిమానాలు ఉండవు అని పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ స్పష్టం చేశారు. ఎతెకాఫ్‌ను చివరి పది రోజుల్లో పాటించాలి. ఇల్లు, కుటుంబం, వృత్తిని పక్కనపెట్టి వీలు పడిన రోజులు (కనీసం 24 గంటలు) మసీదులో గడపడమే ఎతెకాఫ్. అన్నింటినీ త్యాగం చేసి ఆధ్యాత్మికతతో ఉండే మనుషులపై అల్లాహ్ అత్యంత కరుణ చూపి మొరను ఆలకిస్తారని మౌల్వీలు అంటున్నారు. ప్రజాప్రతినిధుల ఇంటికెళ్లి మనం సమస్య చెప్పుకుంటాం. ఆయన అభయం ఇస్తే ధైర్యం వస్తుంది. మన ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి అభయానికే ఊరట కలిగితే.. సృష్టికర్త అల్లాహ్‌తో మొరపెట్టుకుంటే లభించే అనుగ్రహానికి హద్దు ఉండదంటారు.

ఎతెకాఫ్ ఇలా..

ఎతెకాఫ్ ఉండాలంటే శుద్ధి స్నానం చేసి మసీద్‌కు వెళ్లి వజూ (ముఖం, చేతులు, కాళ్లను నీటితో శుద్ధి చేసుకోవడం) చేయాలి. ఎతెకాఫ్ నియ్యత్‌ను చదవాలి. ఇతరుల నుంచి భంగం లేకుండా మూలన ఉన్న డేరా (పర్దా)లోకి వెళ్లాలి. తహతుల్ వజూ, తహతుల్ మజ్జీద్‌ల రెండేసి రకాత్‌ల నఫిల్ నమాజు చదవడం మంచిది. ఖురాన్ పఠనం, దువా, జికర్, ఇతర నమాజ్‌లు చేసుకోవాలి. మల, మూత్ర విసర్జన, వజూ, గుసూల్ స్నానం కోసం మాత్రమే డేరాల్లో నుంచి బయటకు రావాలి కానీ మసీద్ గడప దాటరాదు. సహెరీ, ఇఫ్తార్, దావత్‌లు ఇస్తే స్వీకరించాలి. లేదా ఇంటి నుంచి తెప్పించుకోవాలి. కలిమా ఏ తయ్యిబా 'లాయిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదూర్ రసూలుల్లా' (సొల్లెల్లాహు అలైహి వసల్లం), 'అస్తగ్‌ఫిరల్లాహ్' బాగా పఠించాలి. సహెరి కంటే ముందే 12 రకాతుల 'తహజూద్' (కనీసం రెండు రకాతులు) నమాజ్, సజ్దాలో దువా చేస్తే అల్లాహ్ సమీపం నుంచి మొర వింటారని ఖురాన్ బోధిస్తోంది. భార్య పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రుల కష్ట సుఖాలతో పాటు సర్వ మానవాళి సంక్షేమాన్ని కోరుతూ దువా చేస్తే ఉత్తమం. ఇఫ్తార్ సమయం నుంచి మరుసటి రోజు ఇఫ్తార్ వరకు ఒక రోజు అవుతుంది. చాలా మంది రంజాన్ చివరి రోజులో ఎతెకాఫ్ ఉండి, మరుసటి రోజు ఈద్ చంద్ర దర్శనం చూసి ఇళ్లకు వెళ్తారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఎతెకాఫ్‌కు నగరంలోని పలు మసీదుల్లో ఇప్పటికే ఏర్పాట్లు చేశారు.

రంజాన్‌లో ఎతెకాఫ్‌కు ఎంతో ప్రాధాన్యం



రంజాన్‌లో ఎతెకాఫ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ కార్యంతో వేడుకుంటే అల్లాహ్ ఇంటి గడపపై తల వాల్చి మొరపెట్టుకున్నట్లుగా హదీస్‌లు చెబుతున్నాయి. కుటుంబ సభ్యులు, వృత్తిని వదిలి అల్లాహ్ సన్నిధిలో నమాజ్, జికర్, దువా చేస్తే ఆలకిస్తారు. ఒక్క రోజు చేసినా నరకాగ్ని నుంచి అల్లా కాపాడుతారు.
– మౌలానా మొహమ్మద్ జాబిర్ హుసేన్, కర్నూలు

ఈ రోజులు పవిత్రమైనవి



రంజాన్ మాసంలో చివరి రోజులు మోక్ష మార్గానికి అనువైనవి. తరావి, ఎతెకాఫ్, తాత్రాత్ చదవాలి. ఈ రోజుల్లో కఠోర దీక్షలు ఉంటూ ఖురాన్‌ను పఠించాలి. దైవ బోధనలు చేస్తూ నియమనిష్ఠతో ఉంటే పుణ్యం, మోక్షం లభిస్తాయి.
– అబ్దుల్ ఖాదర్, మౌల్వి, ఆర్టీసీ బస్టాండ్ మసీదు, నంద్యాల

ఎతెకాఫ్‌కి నియ్యత్

మసీద్‌లో అడుగు పెట్టగానే 'బిస్మిల్లాహి దాఖిల్తు వ అలైహి తవక్కల్‌తు వనవైతు సున్నతుల్ ఎతెకాఫ్' నియ్యత్ చదవాలి. రాజకీయాలు, లోక సమాచారం చాడీలు, గొడవలకు తావులేకుండా ఆధ్యాత్మికంగా గడపాలి.

ఎనిమిది మంది పీసీలు ఏఆర్ నుంచి సివిల్‌కు బదిలీ

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం(ఏఆర్)లో పనిచేస్తున్న 8 మంది కానిస్టేబుళ్లను సివిల్ విభాగానికి మార్పు(కన్వర్షన్) చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. సివిల్‌కు మార్పు చేయాలని దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వారికి తిరుపతిలోని పోలీసు శిక్షణా కేంద్రంలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి కౌన్సెలింగ్ ద్వారా వివిధ పోలీస్‌స్టేషన్లకు నియమిస్తూ (పోస్టింగులు) ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. ఎం.హరినాథ్ కుమార్, బి.తిరుమలేష్‌లను ఆదోని టూటౌన్‌కు, జి.విజయ్‌కుమార్, ఎం.రూబెన్, పి.వై.తిమ్మప్పలను ఆదోని త్రీటౌన్‌కు, పి.పుల్లయ్య, వి.రామకృష్ణ, సి.నాగరాజులను పత్తికొండ పీఎస్‌లకు కేటాయించారు. వెంటనే కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంత్రాలయంలో వృద్ధుడి అదృశ్యం


సోమయ్య(ఫైల్)

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ వృద్ధుడు మంగళవారం అదృశ్యమైయ్యాడు. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సోమయ్య (75) అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన మరో 29 మంది భజన బృందంతో కలిసి మంత్రాలయం వచ్చాడు. శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన తర్వాత అచూకీ లభించలేదు. దీంతో భజన బృంద సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ లభిస్తే వెంటనే 9121101151,9121101152 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస కుమార్

వెల్దుర్తి: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పత్తికొండ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస కుమార్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని సచివాలయం 1ను ఎంపీడీఓ శ్రీనివాస రావ్, ఈఓఆర్డీ నరసింహులుతో కలిసి తనిఖీ చేశారు. హాజరు, రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. జగనన్న లే అవుట్లలో గృహాల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నాడు– నేడు పనులపై ఆరా తీశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం చేరుకుని అభివృద్ధి పనుల వివరాలు సేకరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ మునెయ్య పాల్గొన్నారు.

25 మంది పోలీసులకు స్థానచలనం

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా పరిధిలో వీఆర్‌లో ఉన్న 25 మంది పోలీసు సిబ్బందిని వివిధ పోలీసు స్టేషన్లకు బదిలీ చేస్తూ ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వార తక్షణమే ఆయా స్టేషన్ పరిధిలో విధులకు హాజరు కావాలని ఎస్పీ ఆదేశించారు.

ఏడు నక్షత్ర తాబేళ్లు స్వాధీనం



నంద్యాల(రూరల్): పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం పెంచుకుంటున్న ఏడు నక్షత్ర తాబేళ్లను స్థానికులు తెలిపిన వివరాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల ఎఫ్ఆర్ఓ శివయ్య బుధవారం తెలిపారు. పట్టణంలోని టెక్కెలో ఉన్న ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం గత ఏడాది హైదరాబాద్ నుంచి ఆకర్షణీయంగా ఉంటాయని పెంచుకునేందుకు తాబేళ్లను తెచ్చుకున్నారన్నారు. ఇలా పెంచుకోవడం చట్ట విరుద్ధమనే విషయం తెలియదన్నట్లు యాజమాన్యం తెలిపారన్నారు. అందువల్ల కేసు నమోదు చేయకుండా, తాబేళ్లను స్వాధీనం చేసుకొని అడవిలో వదిలేశామన్నారు.

కౌలూరులో మూడు ఇళ్లల్లో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని కౌలూరు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. ఒకేరోజు గ్రామానికి చెందిన మంగలిజ్యోతి, మూలింటి మురళీధర్, వెంకట కిషోర్ ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ మూడిళ్లలో 5 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆయా ఇళ్ల యజమానులు రాత్రి మిద్దెపై పడుకోగా ఈ దొంగతనాలు జరిగాయి. చివరలో నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి తలుపుల తాళం పగులగొట్టుతుండగా శబ్దం రావడంతో స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో పరారయ్యారు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

మనం ప్రజా సేవకులం.. వాళ్లను తిప్పకోవద్దు

అర్జీలు ఇచ్చేవాళ్లు బిచ్చగాళ్లు కాదు
- నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపకపోతే జరిమానా
- 'స్పందన' విషయంలో నిర్లక్ష్యం కూడదు
- పనితీరు మార్చుకోకపోతే ఇబ్బందిపడతారు
- పెండింగ్ భూ హక్కు పత్రాలను 48గంటల్లో పూర్తి చేయాలి
- రెవెన్యూ సర్వీసుల సమీక్షలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): ''మనమంతా ప్రజా సేవకులం. సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇచ్చే ప్రజలు బిచ్చగాళ్లు కాదు. వాళ్లను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు. అర్జీలకు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపకపోతే సంబంధిత అధికారులు తగు వివరణతో పాటు అవసరమైతే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అధికారులు పనితీరును మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవు.'' అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన, రీసర్వే, మ్యూటేషన్, మీ సేవ, స్టోన్‌ప్లాంటేషన్ తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్, జేసీ ఎస్.మౌర్య ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

- సచివాలయాల్లో అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.
- సబ్ డివిజన్, మ్యూటేషన్ సమస్యల కోసం ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారని, వాటికి సచివాలయాల్లో దరఖాస్తు పెట్టుకుంటే పరిశీలించి పరిష్కరించవచ్చన్నారు.
- ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేకు సంబంధించి 68 గ్రామాల్లో 90 శాతం భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామని, మిగిలిన 10 శాతం పెద్దకడబూరు, నందవరం, గోనెగొండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో సంబంధిత తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని సమస్యలను పరిష్కరించి 48 గంటల్లో భూ హక్కు పత్రాలపంపిణీ కార్యక్రమం పూర్తి కావాలన్నారు.
- ఆదోని, పత్తికొండ సబ్ డివిజన్లలో జరుగుతున్న స్టోన్‌ప్లాంటేషన్‌ను ప్రక్రియను మే 15వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జేసీ ఎస్.మౌర్య మాట్లాడుతూ..

పీఓఎల్ఆర్‌కి సంబంధించి ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ పెండింగ్‌లో ఉన్న 60 గ్రామాల్లో త్వరతిగతిన చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఓర్వకల్లు, వెల్దుర్తి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల రీసర్వేకు సంబంధించి డీపీఓ నాగరాజు నాయుడును ఆరా తీయగా 45 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశామని, 35 గ్రామల్లో గ్రామల్లో రీసర్వే పూర్తయినట్లు చెప్పారు. దళితులకు ప్రత్యేక శ్మశానాల కోసం 106 చోట్ల భూసేకరణ చేయాల్సి ఉండగా 100 చోట్ల పూర్తయినట్లు చెప్పారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాద్, మోహన్‌దాస్, సర్వే ఏడీ పవన్ కుమార్, డీపీఓ నాగరాజునాయుడు పాల్గొన్నారు.

శ్రీశైలదేవస్థానం ఏఈఓ డి.మల్లయ్య మృతి


డి.మల్లయ్య (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సహాయ కార్యనిర్వహణాధికారిగా (ఏఈఓ,అన్నదాన విభాగం) విధులు నిర్వహిస్తున్న డి.మల్లయ్య (58) బుధవారం మృతి చెందారు. ఈయన కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం శ్రీశైలంలోని తన స్వగృహంలో మృతిచెందారు. డి.మల్లయ్య శ్రీశైలదేవస్థానంలో పలు విభాగాల్లో పర్యవేక్షకులుగా, ఏఈఓగా విశేషసేవలు అందించారు. ఈయన మృతి పట్ల శ్రీశైలదేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ లవన్న, దేవస్థానం ఉద్యోగుల సంఘం నాయకులు, అధికారులు, సంతాపం తెలిపారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం.

జిల్లా జడ్జిని కలసిన కలెక్టర్


జిల్లా జడ్జికి పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సృజన బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. ఈ క్రమంలో బుధవారం ఆమె కోర్టు భవన సముదాయంలో జిల్లా జడ్జిని కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలసిన ఎస్పీ


జిల్లా ప్రధాన న్యాయమూర్తితో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావులను ఎస్పీ కృష్ణ కాంత్ బుధవారం జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా జడ్జిని కలిసి అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

- జేసీ నారపురెడ్డి మౌర్య


గూడూరులో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ మౌర్య

గూడూరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సచివాలయ ఉద్యోగులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. గూడూరు పట్టణంలోని 5, 6వ సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం మునగాల రోడ్డులోని చెత్త డంపు యార్డును, పట్టణంలో మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంటును ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని ఆమె పరిశీలించారు. జేసీ వెంట నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 3590	రూ. 7061
పొద్దుతిరుగుడు	రూ. 4609	రూ. 4889
ఆముదం	రూ. 3389	రూ. 5464
వాము	రూ. 4000	రూ. 24500
ఉల్లి	రూ. 621	రూ. 753
ఎండు మిర్చి	రూ. 3289	రూ. 25211
శనగలు	రూ. 2800	రూ. 4630
కందులు	రూ. 4000	రూ. 7900
మొక్కజొన్న	రూ. 1089	రూ. 1809
మినుములు	రూ. 3500	రూ. 7049

'పది' మూల్యాంకనం ప్రారంభం


అధికారులకు సూచనలు చేస్తున్న పరిశీలకులు నరసింహారావు, డీఈఓ రంగారెడ్డి

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల మూల్యాంకనాన్ని బుధవారం ఏ క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో జిల్లా పరిశీలకులు నరసింహారావు, డీఈఓ డాక్టర్ వీ రంగారెడ్డి ప్రారంభించారు. అడ్మిట్ కార్డు పొందిన వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి 2,01,059 సమాధాన పత్రాలు రాగా, వాటిని మూల్యాంకనం చేసేందుకు 611 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను, 301 మంది చీఫ్ ఎగ్జామినర్లను, 296 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. మొదటి రోజు బుధవారం సోషల్ మినహా మిగిలిన సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమైంది. హిందీ సబ్జెక్టుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ల కొరత కొంత రావడంతో నంద్యాల జిల్లాలోని టీచర్లను గురువారం నాటికి రప్పించాలని పరిశీలకులు పరీక్షల విభాగం అధికారులకు సూచనలు చేశారు. మూల్యాంకనంలో పాల్గొనే అసిస్టెంట్ ఎగ్జామినర్లు బయటకు వెళ్లకుండా తాత్కలికంగా క్యాంటీన్ ఏర్పాటు చేయించారు. ఈ నెల 26 నాటికి మూల్యాంకనాన్ని ముగించి, మే నెల రెండో వారం 8, 9, 10 తేదీల్లోనే ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది.

ఇంటర్ మూల్యాంకనం పూర్తి

కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కాలేజీలో ఈ నెల 1న ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల మూల్యాంకనం బుధవారం పూర్తయ్యింది. క్యాంపు ఆఫీసర్‌గా ఆర్ఐఓ గురవయ్యశెట్టి వ్యవహరించారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 5 లక్షల సమాధాన పత్రాలు వచ్చాయి. ప్రతి రోజూ ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 15, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 15 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేశారు.